సబ్‌స్టేషన్ ప్రారంభమెప్పుడో..?

- రూ.2 కోట్ల వ్యయంతో నిర్మాణం
- ఓవర్‌లోడ్‌తో మోటార్లు కాలిపోతున్నా నిర్లక్ష్యం



గవిచర్లలో నిర్మించిన విద్యుత్ సబ్‌స్టేషన్

సంగెం : మండలంలోని గవిచర్లలో రూ.2 కోట్ల వ్యయంతో నిర్మించిన విద్యుత్ సబ్‌స్టేషన్ ఎప్పుడు ప్రారంభిస్తారో..? అని రైతులు, మండల ప్రజలు ఎదురు చూస్తున్నారు. ప్రస్తుతం కాపులకనిపర్తి సబ్‌స్టేషన్ నుంచి విద్యుత్ సరఫరా చేస్తున్న క్రమంలో దూరభారంతో తరచూ ఓవర్‌లోడ్, లోఓల్టేజ్ సమస్యలు తలెత్తి ట్రిప్ అవుతుండడంతోపాటు విద్యుత్ మోటార్లు కాలిపోతున్నాయి. సబ్‌స్టేషన్ నిర్మాణం పూర్తి చేసుకుని ఆర్నెళ్లు గడచినా ప్రారంభించకుండా అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

అనేక ఏళ్లుగా గవిచర్ల, షాపూర్ శివారు భాగ్యనగర్, కాట్రపల్లి పరిసరాల వరకు సుమారు 18 కిలోమీటర్ల మేర కాపుల కనిపర్తి సబ్‌స్టేషన్ నుంచి విద్యుత్ సరఫరా అవుతోంది. ఈ గ్రామాల పరిధిలో 30 ట్రాన్స్‌ఫార్మర్ల ద్వారా సుమారు 850కిపైగా విద్యుత్ వ్యవసాయ పంపుసెట్లతోపాటు కోళ్ల ఫారాలు, ఇతర వాణిజ్య సముదాయాలు, గృహ వినియోగానికి విద్యుత్ అందుతోంది. ఈ క్రమంలో అంత దూరం నుంచి విద్యుత్ సరఫరా అవుతుండడంతో ఓవర్‌లోడ్, లోఓల్టేజ్ సమస్యలు తలెత్తి తరచూ ట్రిప్ అవుతున్న దుస్థితి నెలకొన్నాయి. అలాగే విద్యుత్ మోటార్లు కాలిపోవడం పరిపాటిగా మారింది. ఈ క్రమంలో గ్రామంలో 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మిస్తే సమస్య శాశ్వత ప్రాతపదికన పరిష్కారమవుతుందన్న రైతుల, ప్రజల ఆకాంక్ష మేరకు 2023 సెప్టెంబర్ 6న నాటి ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి చొరవతో ఆనాటి మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు రూ.2 కోట్ల వ్యయంతో సబ్‌స్టేషన్ నిర్మాణ పనులను ప్రారంభించారు. సబ్‌స్టేషన్‌కు 11 కేవీ ఫీడర్లు సంగెం, కాపులకనిపర్తి, లోహిత నుంచి అనుసంధానం చేశారు. వ్యవసాయ, వాణిజ్య, గృహ కనెక్షన్లకు వేర్వేరు విద్యుత్ లైన్లు కూడా ఏర్పాటు చేశారు. ఓవైపు ఏదైనా సమస్య తలెత్తితే మరోవైపు నుంచి విద్యుత్ సరఫరా చేసే అవకాశం ఉంది. సబ్‌స్టేషన్ నిర్మాణం పూర్తి చేసుకుని ఆర్నెళ్లు గడుస్తోంది. అయినా సబ్‌స్టేషన్‌ను ప్రారంభించకపోవడంతో లోఓల్టేజ్, ఇతర సమస్యలు పరిష్కారమవుతాయని ఆశించిన రైతులకు నిరాశే మిగిలింది. సబ్‌స్టేషన్‌ను ప్రారంభించాలని ప్రభుత్వానికి, అధికారులకు పలుమార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదంటూ రైతులు, మండల ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా ప్రభుత్వం, అధికార పార్టీ ప్రజాప్రతినిధులు, అధికారులు చొరవ తీసుకుని సబ్‌స్టేషన్‌ను ప్రారంభించాలని కోరుతున్నారు.

సత్వరమే ప్రారంభించాలి

గ్రామ పరిధిలో విద్యుత్ సమస్య తీవ్రంగా ఉంది. నిత్యం ఓవర్‌లోడ్, విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతున్న దుస్థితి నెలకొంది. లోఓల్టేజ్‌తో మోటార్లు కాలిపోతున్నాయి.సబ్‌స్టేషన్ నిర్మాణం పూర్తి చేసుకుని నెలలు గడుస్తోంది. అయినా ప్రారంభించకపోవడంతో రైతులు, వ్యాపారస్తులు, ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇకనైనా వెంటనే సబ్‌స్టేషన్‌ను ప్రారంభించాలి.

– లింగాల నవీన్, రైతు, గవిచర్ల

ఆపరేటర్ల కొరతతోనే..

గవిచర్ల 33/11 కేవీ సబ్‌స్టేషన్ నిర్మాణం పూర్తి అయింది. ఈ ప్రాంతంలో విద్యుత్ సమస్య తొలగించేలా సాంకేతిక పరీక్షలు సైతం పూర్తి అయింది. ఆపరేటర్ల కొరత ఉంది. కొత్తగా ఇద్దరు ఆపరేటర్ల నియమకం కోసం ప్రభుత్వ అనుమతికి ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపించాము. త్వరలోనే ప్రభుత్వ ఆపరేటర్లను నియమించే దిశగా చొరవ తీసుకుంటున్నాం. త్వరలో సబ్‌స్టేషన్‌ను ప్రారంభిస్తాం.

– నర్సింహారావు, ఏడీఈ, విద్యుత్ శాఖ

ఘనంగా మహిళా దినోత్సవం



వర్ధన్నపేట : మాట్లాడుతున్న ఎంపీడీఓ



గీసుకొండ : మహిళను సన్మానిస్తున్న సీడీపీఓ

గంగదేవిపల్లిలో..

వర్ధన్నపేట : పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో, ప్రభుత్వ హైస్కూల్‌లో సోమవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ పోషయ్య అధ్యక్షత వహించగా ముఖ్యఅతిథిగా ఎంపీడీఓ వెంకటరమణ హాజరై మాట్లాడారు. అలాగే హైస్కూల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో పీఆర్టీయూ నాయకులు ప్రసంగించారు. మహిళలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. కార్యక్రమాల్లో అధ్యాపకులు రాజు, రజిత, విష్ణుకుమార్, రెడ్డప్ప, మధుసూదన్‌రెడ్డి, శ్రీనివాస్, పీఆర్టీయూ నాయకులు నిమ్మ మనుజేందర్‌రెడ్డి, అశోక్‌కుమార్, గట్టు వెంకటేశ్వర్లు, కుసుమ కుమారస్వామి, శ్రీనివాసరావు, సమ్మిరెడ్డి, శోభ కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

గీసుకొండ : గంగదేవిపల్లిలో వర్ధన్నపేట ఐసీడీఎస్, సర్వోదయ యూత్ ఆర్గనైజేషన్ సంయుక్త ఆధ్వర్యంలో మహిళా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీఓ డెబోరా, సర్వోదయ ఆర్గనైజేషన్ కార్యదర్శి డాక్టర్ పల్లెపాడు దామోదర్ మాట్లాడారు. అన్ని రంగాల్లోనూ మహిళలకు శ్రమకు తగిన ప్రతిఫలం దక్కాలని ఆకాంక్షించారు. సమాజ అభివృద్ధిలో మహిళ పాత్ర కీలకమన్నారు. మహిళలకు సర్టిఫికెట్లు అందించి శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా ట్రైనింగ్ మేనేజర్ కూసం రాజమౌళి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు సువర్ణ, ప్రసన్న, ఈశ్వరి, స్వప్న, మాధవి, అంగన్‌వాడీ టీచర్లు అనిత, నిర్మల, సునీత, సర్వోదయ ఆర్గనైజేషన్ ప్రతినిధులు ఇందిర, అక్తర్, వనిత తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులే ఉపాధ్యాయులైన వేళ



వర్ధన్నపేట : విద్యార్థులతో హెచ్‌ఎం, ఉపాధ్యాయులు

వర్ధన్నపేట : పట్టణంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో సోమవారం నిర్వహించిన స్వయం పరిపాలన దినోత్సవం సందర్భంగా విద్యార్థులే ఉపాధ్యాయులై అలరించారు. తోటి విద్యార్థులకు తరగతులు బోధించి ఆకట్టుకున్నారు. డీఈఓగా ఎస్.అక్షిత, ఎంఈఓగా ఆఫ్రీన్, ప్రధానోపాధ్యాయురాలిగా బి.అక్షిత, ఉపాధ్యాయులుగా పలువురు విద్యార్థులు వ్యవహరించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం భుక్యల భ్యాట్రిస్ మాట్లాడారు. విద్యార్థులు ఉపాధ్యాయులుగా నైపుణ్యం ప్రదర్శించారని అభినందించారు. విద్యార్థులను విజ్ఞానాన్ని వెలికితీసేలా కార్యక్రమం దోహదపడుతుందని చెప్పారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రాజకుమారి, అనిత, శ్రీనివాస్, సురేష్, గాయాల సుమన్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

వేడుకగా లక్ష్మీనృసింహ స్వామి కల్యాణం



చెన్నారావుపేట : మండలంలోని కోనాపురంలోని ఊరగుట్టపై శ్రీలక్ష్మీనృసింహస్వామి కల్యాణాన్ని సోమవారం రాత్రి వేడుకగా నిర్వహించారు. ప్రధాన అర్చకులు కసివోజ్జల శివకృష్ణచార్యులు, శంకరశాస్త్రి, రణధీర్ శర్మ, సునీల్ శాస్త్రి, కౌశిక్ శర్మ, గురుబ్రహ్మాచార్యులు ప్రత్యేక పూజలు చేపట్టారు. అష్టోత్తర ఘటాభిషేకం నిర్వహించారు. పంచామృత అభిషేక హోమాలు చేశారు. భక్తులు వేడుకలు తిలకించేలా ఎల్ఈడీ స్క్రీన్ ఏర్పాటు చేశారు. అనంతరం అన్నదానం చేశారు. కార్యక్రమంలో నాయకులు ఎడ్ల నరేందర్‌రెడ్డి, కందుల ప్రభాకర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

తలుపుల బహూకరణ

కోనాపురం శ్రీలక్ష్మీనృసింహస్వామి ఆలయంలోని గర్భగుడికి గొట్టుకుల శ్రీలత సంపత్, జ్యోతి వెంకటేశ్, వంశీ, తనీష్, ఆద్యశ్రీ సోమవారం తలుపులు బహూకరించారు. ఈ సందర్భంగా వారి ఇంటి నుంచి తలుపులను ఊరేగింపుగా తీసుకొచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అర్చకులు శివకృష్ణాచార్యులుకు తలుపులు అందజేశారు. కార్యక్రమంలో గూడ శ్రీనివాస్, సుమలత, నరేశ్, రవి, కుమారస్వామి, జనార్ధన్, మాజీ ఉపసర్పంచ్ నర్సింహరాములు, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో పలువురి చేరిక



నల్లబెల్లి : కాంగ్రెస్ పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ ఇస్తారి శేఖర్ ఆధ్వర్యంలో మండలంలోని ముచ్చింపులకు చెందిన పలువురు సోమవారం కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా నర్సంపేటలోని క్యాంప్ కార్యాలయంలో వారికి ఎమ్మెల్యే మాధవరెడ్డి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన వారిని ఎమ్మెల్యే అభినందించారు. కార్యక్రమంలో పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు బొట్ల ఇంద్రసేన, ప్రధాన కార్యదర్శి పులి అనిల్, నాయకులు అంగోత్ పూల్‌సింగ్, పాలకుర్తి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీలో..

చెన్నారావుపేట : మండలంలోని అక్కల్‌చెడ గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు లావుడ్య రాజు, లావుడ్యా శివ, బాదావత్ సంతోశ్, భుక్యా నవీన్, మూడు వెంకన్న, బాదావత్ గణేష్, బాదావత్ వెంకన్న సంకెళ్ల ఉప్పలయ్య, కోరె మల్లయ్య, సంతోశ్ బీజేపీలో సోమవారం చేరారు. ఈ మేరకు వారికి బీజేపీ జిల్లా కార్యదర్శి డాక్టర్ గోగుల రాణాప్రతాప్‌రెడ్డి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించి మాట్లాడారు. నానాటికీ పార్టీ బలపడుతోందని చెప్పారు. కార్యక్రమంలో బీజేవైఎం జిల్లా కార్యదర్శి ఎర్ర రాజు, బీజేపీ మండల అధ్యక్షుడు దామెరుప్పుల శేఖర్, నాయకులు దుంక దువ్వ రంజిత్, మురహరి విజయ్, కాటి హరీశ్, కీసరి సాంబరాజు, పడిదం హరికృష్ణ, గణేశ్, తదితరులు పాల్గొన్నారు.

అనాథల వివాహ ఏర్పాట్లపై హర్షం

నర్సంపేట : పట్టణంలోని సంజీవని అనాథ ఆశ్రమ నిర్వాహకులు డాక్టర్ మోహన్‌రావు దంపతులు అనాథల వివాహ ఏర్పాట్లు చేస్తుండడంపై ఐసీడీఎస్ సీడీపీఓ మధురిమ హర్షం వ్యక్తం చేశారు. నర్సంపేట మండలంలోని బొజ్జనాయక్‌తండాకు చెందిన రోజ, చెన్నారావుపేట మండలం ఉప్పరపల్లికి చెందిన నాగరాణిలకు (అనాథలు) ఆశ్రమంలో ఆశ్రయం కల్పించి ఒకటో తరగతి నుంచి చదివించడంతోపాటు ఈనెల 12న వివాహం జరిపించేందుకు ఏర్పాట్లు చేశారు. ఈ క్రమంలో రోజ, నాగరాణిలను సోమవారం పెళ్లి కూతుళ్లుగా ముస్తైదువలు చేశారు. ఈ కార్యక్రమానికి సీడీపీఓ హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు నల్లా భారతి, సూపర్‌వైజర్లు రాధ, మాధవి, కస్తూరిభాయి మహిళా మండలి అధ్యక్షురాలు గుర్రపు అరుణ, తదితరులు పాల్గొన్నారు.

గురుకుల పాఠశాల నిర్మాణంపై..

చెన్నారావుపేట : మండలంలోని అమీనాబాద్‌లో ఇంటిగ్రేటెడ్ గురుకుల పాఠశాల నిర్మాణంపై కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి మొగిలి వెంకట్‌రెడ్డి, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ సిద్దన రమేశ్ హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు వెంకట్‌రెడ్డి, తదితరులు ఎమ్మెల్యే మాధవరెడ్డిని కలిసి పుష్పగుచ్ఛం అందజేసి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు హరీశ్, నాయకులు వీరారెడ్డి, యాకయ్య తదితరులు పాల్గొన్నారు.

విరాళం

పర్వతగిరి : మండలంలోని వడ్లకొండలోని రంగనాయకుల స్వామి గుట్ట ఆవరణలో తలపెట్టిన శ్రీసీతారామాంజనేయస్వామి ఆలయ నిర్మాణానికి కొంగ సమ్మయ్య జ్ఞాపకార్థం ఆయన మనుమరాలు మీసాల హర్షశ్రీ రఘు వెంకటేశ్ దంపతులు సోమవారం రూ.25 వేల 116 విరాళం అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ బాధ్యులు దాతలకు కృతజ్ఞతలు తెలిపారు. విరాళం అందజేయడంపై హర్షం వ్యక్తం చేశారు.

సావిత్రిబాయి ఆశయ సాధనకు కృషి



నివాళులర్పిస్తున్న ఐద్వా నాయకురాళ్లు

నర్సంపేట: సావిత్రిబాయి పూలే ఆశయ సాధనకు ప్రతీఒక్కరు కృషి చేయాలని ఐద్వా పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు ఫరీదా, బిట్ర స్వప్న కోరారు. ఆ సంఘం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం పూలే వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి మాట్లాడారు. కార్యక్రమంలో పట్టణ కోశాధికారి వజ్జంతి విజయ, రుద్రారపు లక్ష్మి, పట్టణ నాయకులు ఉదయగిరి నాగమణి, గణిపాక ఇంద్ర, బి.లక్ష్మి, జెట్టి విజయలక్ష్మి, తోటకూరి రజిత, పాశం శ్రీలత, ఉదయగిరి సరిత, జ్యోతి, తదితరులు పాల్గొన్నారు.

అమరవీరుల స్తూపం వద్ద..

పట్టణంలోని అమరవీరుల స్తూపం వద్ద సమితి ఆధ్వర్యంలో సావిత్రిబాయి పూలే వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా సమితి పట్టణ కన్వీనర్ మహాదేవుని జగదీశ్ మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు రామగిరి రవికుమార్, ఆకారపు మోహన్, సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.

వర్ధన్నపేట : పట్టణంలోని అంబేద్కర్ విజ్ఞాన కేంద్రంలో ప్రజాసంఘాల ఆధ్వర్యంలో సావిత్రిబాయి వర్ధంతి నిర్వహించారు. ఆమె చిత్రపటానికి నాయకులు పూలమాల వేసి నివాళులర్పించి మాట్లాడారు. భారతీయ సంఘ సంస్కర్తగా సేవలు అందించారని చెప్పారు. కార్యక్రమంలో నాయకులు జన్ను నర్సయ్య, వల్లందాసు కుమార్, అంజయ్య, ఈరెల్లి శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

రాయపర్తి : అంబేడ్కర్, బాబు జగ్జీవన్ రామ్, మహాత్మ జ్యోతిరావుపూలే నిర్వహణ కమిటీ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో సావిత్రిబాయి పూలే చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ అనుబంధ ఎస్సీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు గబ్బెట బాబు, నాయకులు ఐత మల్లేశ్, గారె శ్రీనివాస్, మద్దెల వెంకటేశ్, యాకయ్య, కముటం వీరస్వామి, తదితరులు పాల్గొన్నారు.

నల్లబెల్లి : మండల కేంద్రంలో సావిత్రిబాయి పూలే వర్ధంతిని బీసీ హక్కుల సాధన సమితి ఆధ్వర్యంలో నిర్వహించారు. సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి చింతకింది కుమారస్వామి, నాయకులు తడుక అశోక్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

టెన్త్ విద్యార్థులు ఆందోళనకు గురికావొద్దు



రాయపర్తి: టెన్త్ విద్యార్థులు పరీక్షల గురించి ఆందోళనకు గురికావొద్దని, ధైర్యంగా పరీక్షలకు హాజరు కావాలని ఉమ్మడి జిల్లా పరీక్షల బోర్డు ప్రధాన కార్యదర్శి గారె కృష్ణమూర్తి అన్నారు. సోమవారం డీఈఓ ఆదేశాల మేరకు మండలకేంద్రంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలికల పాఠశాల, మహాత్మా హైస్కూల్‌లో నిర్వహిస్తున్న ప్రీ ఫైనల్ పరీక్షలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఓఎంఆర్ షీట్ జత చేయడంలో జాగ్రత్తలు పాటించాలన్నారు. ప్రిన్సిపాల్స్ సరిత, కుంట సరిత, సీఆర్పీ రమేశ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యారంగానికి 30 శాతం నిధులు కేటాయించాలి

నర్సంపేట : రాష్ట్ర ప్రభుత్వం రాబోయే శాసన సభ సమావేశాల్లో విద్యారంగానికి 30 శాతం నిధులు కేటాయించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి యార ప్రశాంత్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో సోమవారం ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా యార ప్రశాంత్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో ప్రభుత్వ విద్యా రంగం సమస్యలతో సతమతమవుతుందన్నారు. సంక్షేమ వసతి గృహాలు, గురుకుల, కేజీబీవీ విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ప్రభుత్వం ప్రకటించి పెంచిన మెస్ చార్జీలు అమలు చేయాలని, పెరిగిన ధరలకు అనుగుణంగా మధ్యాహ్న భోజన చార్జీలను పెంచాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు భానోతు వినోద్‌కుమార్, నాయకులు పైసా గణేశ్, తదితరులు పాల్గొన్నారు.

ఎస్సారెస్పీ ఉపకాల్వను శుభ్రం చేయిస్తాం

- బీఆర్ఎస్ నేత శ్రీనివాస్‌రెడ్డి

రాయపర్తి : మండల కేంద్రంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల వెనకాల ఉన్న ఎస్సారెస్పీ ఉపకాల్వను శుభ్రం చేయిస్తామని బీఆర్ఎస్ నేత, ఎస్ఆర్ఆర్ ఫౌండేషన్ చైర్మన్ పరుపాటి శ్రీనివాస్‌రెడ్డి రైతులకు భరోసా ఇచ్చారు. చెత్తాచెదారం పేరుకుపోయి కాల్వ పూడుకపోవడంతో నీళ్లు అందక పంటలు ఎండిపోతున్నాయంటూ రైతులు సమస్యను ఇటీవల వివరించడంతో సోమవారం ఆయన సందర్శించి సమస్యను ప్రత్యక్షంగా పరిశీలించారు. అనంతరం ఆయన రైతులతో మాట్లాడారు. కాల్వలో పేరుకుపోయిన చెత్త, పిచ్చిమొక్కలను ఫౌండేషన్ ఆధ్వర్యంలో తొలగింపజేస్తామని చెప్పారు. ఎంత ఖర్చు అయినా సత్వరమే సమస్యను పరిష్కరించి పంటలకు నీరందించేలా చొరవ తీసుకుంటామని భరోసా ఇచ్చారు. అనంతరం మండలంలోని పెర్కవేడు, కొత్తూరు గ్రామాలను సందర్శించి ఇటీవల మృతి చెందిన మంచాల మల్లయ్య, ఊగ యాకయ్య, బొమ్మిదేని దేవకమ్మ కుటుంబాలకు బియ్యంతోపాటు ఆయిల్ క్యాన్ సాయంగా అందజేశారు. అలాగే రాయపర్తిలో రోడ్డు ప్రమాదంలో గాయపడిన ఐత జంపికి రూ.5 వేల సాయం అందజేశారు. కార్యక్రమాల్లో మాజీ ఎంపీపీ జినుగు అనిమిరెడ్డి, బీఆర్ఎస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి పూస మధు, లేతాకుల రంగారెడ్డి, ఎస్టీ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సురేందర్ నాయక్, అధికార ప్రతినిధి తాళ్లపెల్లి సంతోశ్, ఎలమంచ శ్రీనివాస్‌రెడ్డి, ఐత రాంచందర్, చిన్నాల రాజబాబు, బొమ్మెర వీరస్వామి, తదితరులు పాల్గొన్నారు.

వైకుంఠధామాల్లో సౌకర్యాలు కల్పించాలి

పర్వతగిరి : వైకుంఠధామాల్లో దహన సంస్కారాల కోసం వచ్చే వారికి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన సౌకర్యాలు కల్పించాలని ఎంపీఓ పాక శ్రీనివాస్ సూచించారు. పర్వతగిరి, దౌలత్ నగర్, మాల్యతండా గ్రామాల్లోని వైకుంఠధామాలను సోమవారం ఆయన సందర్శించి ఏర్పాట్లను ప్రత్యక్షంగా పరిశీలించి పంచాయతీ కార్యదర్శులతో మాట్లాడారు. వైకుంఠధామాల్లో పారిశుద్ధ్య, ఇతర పనులు నిర్వహించాలని చెప్పారు. నీటి, విద్యుత్ సదుపాయాల కల్పనలో నిర్లక్ష్యం చేయొద్దని కోరారు. కార్యక్రమంలో కార్యదర్శులు రఘు, విక్రమ్, రాజు, తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతున్న వ్యవసాయ కూలీ మృతి

చెన్నారావుపేట : బొలెరో వాహనం బోల్తాపడి గాయాలపాలై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మండలంలోని జీడిగడ్డ తండాకు చెందిన వ్యవసాయ కూలీ బానోతు ఈర్య (55) పరిస్థితి విషమించి సోమవారం మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులున్నారు. కాగా మిర్చి ఏరడానికి సమ్మక్క తీసుకెళ్లడం వల్లే మృతి చెందాడంటూ ఆమె ఇంటి ఎదుట ఈర్య మృతదేహంతో బాధిత కుటుంబీకులు ఆందోళన చేపట్టారు. తమకు పరిహారం చెల్లించకపోతే సమ్మక్క ఇంటి ఎదుటే దహన సంస్కారాలు నిర్వహిస్తామని భీష్మించారు. ఎస్సై రాజేశ్‌రెడ్డి అక్కడకు చేరుకుని ఆందోళనకారులతో మాట్లాడారు. న్యాయం చేస్తామని హామీ ఇచ్చి ఆందోళన విరమింపజేశారు.

ఆర్థికసాయం

గీసుకొండ : మండలంలోని ధర్మారం గ్రామానికి చెందిన గోపాల సతీశ్ సతీమణి ఇటీవల మృతి చెందగా బాధిత కుటుంబానికి సతీశ్ పదో తరగతి నాటి మిత్రులు సోమవారం రూ.10 వేల సాయం అందజేశారు. ఈ మేరకు సదరు రూ.10 వేలను సతీశ్ కూతురు పేరిట డిపాజిట్ చేసి బాండ్‌ను అందజేశారు. కార్యక్రమంలో సతీశ్ స్నేహితులు శ్రీకాంత్, శంకర్, రాజు, ప్రసాద్, బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

పెర్కవేడులో..

రాయపర్తి : మండలంలోని పెర్కవేడు గ్రామానికి చెందిన ఐత ఉప్పలమ్మ ఇటీవల మృతి చెందగా బాధిత కుటుంబానికి బీఆర్ఎస్ నాయకులు సోమవారం ఆర్థికసాయం అందజేశారు. మృతురాలి చిత్రపటానికి నివాళులర్పించారు. బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. కార్యక్రమంలో నాయకులు చిన్నాల రాజబాబు, బొమ్మెర వీరస్వామి, బండి రాజబాబు, బాషబోయిన సుధాకర్, అమ్జద్‌పాషా, సుధాకర్, నిమ్మల మధు తదితరులు పాల్గొన్నారు.

స్వేరోస్ కార్యదర్శిగా ప్రవీణ్



పర్వతగిరి : మండలంలోని రోళ్లకల్‌కు చెందిన కందికట్ల ప్రవీణ్ స్వేరోస్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా నియమితులయ్యారు. రాష్ట్ర నాయకులు పుల్లా కిషన్, మారేపల్లి మనోజ్, శ్రీనివాస్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా విలేకరులతో ప్రవీణ్ మాట్లాడారు. స్వేరో నెట్‌వర్క్ లక్ష్యాలను ముందుకు తీసుకెళ్లడంలో శక్తివంచన లేకుండా పని చేస్తానని తెలిపారు.

కొండెంగకు అంత్యక్రియలు

చెన్నారావుపేట : మండలంలోని లింగాపురంలో కొండెంగ ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై మృతి చెందగా గ్రామస్తులు విభూతి శివకుమార్, ఎనుకతల ఇంద్రయ్య, పల్లాటి రమేశ్, గోపతి రాజు, గోపాలమిత్ర మధుకర్ అంత్యక్రియలు నిర్వహించారు. కొండెంగ విద్యుదాఘాతానికి గురై కొన ఊపిరితో ఉండగా తొలుత స్థానిక ఆర్ఎంపీతో చికిత్స చేయించారు. ఈ ఘటన గ్రామంలో చర్చనీయాంశంగా మారింది.

సమతుల ఆహారంతో ఆరోగ్యం

సంగెం : సమతుల ఆహారం తీసుకుంటేనే సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని తహసీల్దార్ రాజ్‌కుమార్ తెలిపారు. స్థానిక గ్రామ పంచాయతీ ఆవరణలో ఇన్‌స్టిట్యూట్ ఫర్ గ్లోబల్ డెవలప్‌మెంట్ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన పోషణ మేళా కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. సమాజంలోని ప్రతిఒక్కరూ ఐరన్, ఐయోడిన్ లోపాన్ని నివారించుకోవడంతోపాటు వ్యక్తిగత, పరిసరాల శుభ్రత పాటించాలని సూచించారు. ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లతో ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా కోఆర్డినేటర్ నల్లబెల్లి రాజ్, విజయ్ శివాజీ, నరేశ్, లింగమూర్తి, ఉష, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

గంజాయి విక్రేతల అరెస్ట్

గీసుకొండ : మండలంలోని కట్టమల్లన్న ఆలయం వద్ద గంజాయి అమ్మడానికి ప్రయత్నిస్తున్న ఇద్దరిని సోమవారం అరెస్ట్ చేసినట్టు ఇన్‌స్పెక్టర్ మహేందర్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. జాన్‌పాకకు చెందిన అన్నం భాస్కర్, చింతల్‌కు చెందిన పెద్దపల్లి రవివర్మ అనే వ్యక్తులు 900 గ్రాముల ఎండు గంజాయి (రూ.36 వేలు) అమ్మడానికి ఉపక్రమిస్తుండగా ఎస్సై ప్రశాంత్‌బాబు, సిబ్బందితో కలిసి వారిని తనిఖీ చేయగా గంజాయి లభించిందన్నారు. గంజాయిని స్వాధీనం చేసుకుని నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడి మృతి

పర్వతగిరి : మండలంలోని కల్లెడకు చెందిన దుగ్యాల వసంతరావు (66) ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా ప్రమాదవశాత్తు వాహనం అదుపుతప్పి రెయిలింగ్‌కు తగిలి పోలుకమ్మ చెరువులో పడి మృతి చెందాడు. ఎస్సై ప్రవీణ్ కథనం ప్రకారం.. వసంతరావు దౌలత్‌నగర్‌కు వెళ్లి కల్లెడకు ద్విచక్ర వాహనంపై వస్తుండగా పోలుకమ్మ చెరువు రెయిలింగ్‌ను ఢీకొట్టాడు. దీంతో వసంతరావు చెరువులో పడిపోయాడు. స్థానికులు సమాచారం అందించడంతో పోలీసులు ఘటనా స్థలికి చేరుకొని వసంతరావు మృతదేహానికి బయటకు తీశారు. పోస్టుమార్టం నిమిత్తం వరంగల్‌లోని ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. మృతుడి కుటుంబీకుల రోదనలు మిన్నంటాయి. స్థానికంగా విషాదం నెలకొంది. మృతుడి పెద్ద కుమార్తె జూలపల్లి శోభ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. బాధిత కుటుంబాన్ని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు పిన్నింటి అనిల్ రావు, తదితరులు పరామర్శించారు.

సీఎం, ఎమ్మెల్యే చిత్రపటాలకు క్షీరాభిషేకం



గీసుకొండ : క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు



సంగెంలో..

గీసుకొండ : మండల కేంద్రంలో సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి చిత్రపటానికి కాంగ్రెస్ నాయకులు సోమవారం క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆ పార్టీ పరకాల నియోజకవర్గ అధికార ప్రతినిధి చాడ కొమురారెడ్డి మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం యంగ్ ఇండియా సమీకృత గురుకుల పాఠశాలలను నెలకొల్పడానికి నిర్ణయించడం పేద విద్యార్థుల పాలిట వరమన్నారు. గత బీఆర్ఎస్ సర్కారు కేజీ టూ పీజీ కార్పొరేట్ స్థాయిలో ఉచితంగా అందజేస్తామన్న హామీని విమర్శించగా కాంగ్రెస్ ఎన్నికల మానిఫెస్టోలో ప్రకటించిన మేరకు ఇంటిగ్రేటెడ్ స్కూళ్లను మంజూరు చేసిందని చెప్పారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు తుమ్మనపెల్లి శ్రీనివాస్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఆకుల రుద్రప్రసాద్, నాయకులు బీమగాని సౌజన్య, కూసం రమేశ్, దొడు భరత్, స్వామి, జీవన్, మోహన్, అభిలాశ్, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

సంగెం : మండల కేంద్రంలో సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి చిత్రపటాలకు కాంగ్రెస్ నాయకులు క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆ పార్టీ మండల అధ్యక్షుడు చొల్లేటి మాధవరెడ్డి మాట్లాడారు. యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్ల నిర్మాణానికి నిధుల మంజూరీపై హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ అచ్చ నాగరాజు, పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్లు రమేశ్, కేశవులు, నాయకులు ఆగపాటి రాజు, సంధ్యారాణి, రాజ్‌కుమార్, పాషా, రవి, కవిత, వెంకటేశ్వర్లు, శ్రీకర్, వీరమ్మ, ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

కోనారెడ్డి చెరువును కాపాడాలని వినతి



వర్ధన్నపేట : వినతిపత్రం ఇస్తున్న నాయకులు

వర్ధన్నపేట : మండలంలోని కోనారెడ్డి చెరువును ఆక్రమణ నుంచి కాపాడాలని కోరుతూ బీఆర్ఎస్ నాయకులు గోధుమల మధు, తూళ్ల కుమారస్వామి ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ సత్యశారదకు కలెక్టరేట్‌లో ప్రజావాణి సందర్భంగా సోమవారం వినతిపత్రం అందజేశారు. అనంతరం మధు, కుమారస్వామి కలెక్టర్‌కు సమస్యను వివరించార. కోనారెడ్డి చెరువు మత్తడి ఆక్రమణకు గురవుతోందని, ఆ కారణంగా కుంచించుకుపోయి కట్టకు ప్రమాదం ఏర్పడిందని తెలిపారు. చెరువులో కట్టలు పోసి నీటి ప్రవాహాన్ని అడ్డుకుంటున్నారని తెలిపారు. అలాగే కొందరు రైతులు మోటార్లతో నీరు లాగుతుండడంతో ఆయకట్టు రైతులకు తీరని నష్టం వాటిల్లుతోందని చెప్పారు. మత్తడి కట్టను సర్వే చేయించి కబ్జాదారుల నుంచి పరిరక్షించాలని, చెరువులో మోటార్లు వేస్తున్న వారిని కట్టడి చేసేలా అధికారులను ఆదేశించాలని కోరారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు మార్గం భిక్షపతి, సిలువేరు కుమారస్వామి, తుమ్మల యాకయ్య తదితరులు పాల్గొన్నారు.

‘తలనీలాల..’ నిందితులను అరెస్ట్ చేయాలని..

పర్వతగిరి : మండలంలోని అన్నారం షరీఫ్ దర్గాలో తలనీలాలు మాయం చేసిన నిందితులను అరెస్ట్ చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని తెలంగాణ అంబేడ్కర్ సంఘం జిల్లా కోకన్వీనర్ జంగిలి భాస్కర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన ఆధ్వర్యంలోని బృందం జిల్లా కలెక్టర్ సత్యశారదకు సోమవారం వినతిపత్రం అందజేసింది. అనంతరం భాస్కర్ మాట్లాడారు. సుమారు రూ.60 లక్షల విలువైన తలనీలాలను అక్రమంగా అమ్ముకున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో నాయకులు గుండె సురేశ్, తాటికాయల ఎల్లయ్య, రాజు, రమేశ్, తదితరులు పాల్గొన్నారు.